# అతనికంటె ఘనుడు

అంత పెద్ద మొత్తంలో రొఖ్ఖం వెంట తీసుకొని వెళ్లడం మంచిది కాదని రాఘవయ్యకు గట్టిగానే అనిపించింది. యజమానితో ఆ విషయం మనవి చేసుకొన్నాడాయన. ఆ మేరకు డ్రాఫ్టు తీసుకొని వెళ్లవచ్చునని సూచించాడు రాఘవయ్య. కాని ఆయన యజమాని అందుకు ఒప్పుకోలేదు. ఇంక మాట్లాడకుండా చెప్పినట్లు చెయ్యమనీ, ప్రయాణానికి కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయనీ కొంచెం కటువుగా చెప్పాడా కమిషన్ కొట్టు యజమాని.

రైలులో ఎక్కి కూర్చున్న కొద్ది సేపటికి రాఘవయ్యకు కొంచెం భయంవేసింది. రాత్రిపూట ప్రయాణం. తోటి ప్రయాణీకులు ఇద్దరే ఉన్నారు. వాళ్లకూడా తనతోపాటే అక్కడే ఎక్కారు. ఆయన ప్రక్క సీటులో ఒక ఆడమనిషి కూర్చుంది. ఆవిడ ప్రక్కసీటులో మరొకరు ప్రక్కపరచుకొని, కూర్చుని బీడీ కాలుస్తున్నాడు. అతను రాఘవయ్య వంక కొంచెం కోపంగా, అనుమానంగా చూచాడు ఒకటి రెండు సార్లు. అందువల్ల రాఘవయ్య ఆయన్ను పలకరించలేదు. రాత్రి పన్నెండు గంటలు దాటాక ఆయనకు నిద్ర ముంచుకొని వచ్చింది. ఆయన కునుకు తీయడం మొదలు పెట్టాడు.

ఆయన ప్రక్క సీటులో కూర్చున్న ఆవిడ ఆయనవంక చూచి నవ్వుతూ "అదేమిటండీ కూర్చునే నిద్రపోతున్నారూ. బెడ్డింగు వున్నది కదా హాయిగా ప్రక్క పరుచుకోకూడదూ? ఆడవాళ్లమైతే మెళ్లో నగలు

ఎవరైనా కత్తిరించుకొని పోతారని భయపడతాం మీకేం మగవాళ్ల పెద్ద వ్యాపారంలో కూడబెట్టినదంతా నగల రూపంలో ఆడవాళ్ళ మెళ్లో దాచేస్తారు. ఆస్తి ఆడదాని మెడపై నగలరూపంలో ఉంటే వ్యాపారంలో దివాళా తీసినా, ఆదాయం పన్ను, అమ్మకం పన్ను వంటివి ఎగవేసినా ఎంతటి అధికారి అయినా తాకడానికి సాహసించడు. అవునుకదండీ?" అన్నది.

'బాగా మాటలు నేర్చిన మనిషి. ఏదో ప్లానుమీదే వున్నది' అనుకొని నవ్వుకొన్నాడు రాఘవయ్య. కొన్ని క్షణాలు వూరుకొని "అదేం, మాట్లాడరేం? నా అభిప్రాయం తప్పంటారా?" అన్నది ఆమె రెట్టిస్తూ.

"నాకు బాగా తెలియదు పెద్ద వ్యాపారస్తులకు మాత్రమే తెలుస్తాయి ఇటువంటి విషయాలు" అన్నాడు రాఘవయ్య కొంచెం పెద్దగా. ఆమె ఆయనవంక చూచి అకారణంగా నవ్వుతూ "మీరు పెద్ద వ్యాపారస్తులని అనుకొన్నాను సుమండీ, మీరు..." అని ఇంక ఏమో అనబోతూ అవతల ప్రక్కసీటులో కూర్చున్న మనిషి కాళ్ళతో నేలమీద కొట్టి, చప్పుడు చేసేసరికి ఆగిపోయింది. ఆమె అటూ ఇటూ భయం భయంగా చూసి, అంతలో తెప్పరిల్లుకొని నవ్వుతూ "ఈ మాత్రానికి వ్యాపారస్తులే కానక్కరలేదు లెండి. ఊరికేనే నలుగురూ అనుకొనే మాట నేనూ అన్నాను. మీరేమీ అనుకోకండి. మీరు వ్యాపారస్తులు అయితే నాకేం - ఉద్యోగస్తులు అయితే నాకేం? తోటి ప్రయాణీకులు కనుక ఏదో తోచక అన్నాను. అయినా ఇలాంటి ప్రయాణంలో జాగ్రత్తగా ఉండడం అవసరమే. అదీకాక ఈ రోజులలో ఎవరినీ నమ్మకూడదు" అన్నది. అలా అంటూ ఆమె పమిటకొంగు లాక్కొని మెడనిండా కప్పుకుని కాళ్లు చాపుకుని పడుకున్నది.

'ఏదైనా వినోదయాత్రకు బయలుదేరినప్పుడు ఇటువంటి మనిషి తటస్థపడితే తమాషాగానే ఉంటుంది. మనిషి అసలు ఎటువంటిదో తెలుసుకునే ప్రయత్నం చెయ్యవచ్చు' అనుకుని ఆయన నవ్వుకున్నాడు. ఆమె అలా పడుకొని కూడా ఆయన వంక అలా దొంగచూపులు చూస్తూనే ఉన్నది. ఆయనకు వాళ్ళిద్దరి పైనా గట్టి అనుమానం కలిగింది. వాళ్ళ బెడద వదిలించుకోవడం ఎలాగా అని జాగ్రత్తగా ఆలోచించి, చివరకు నెమ్మదిగా పర్సుతీసి, పై ఖర్చులకోసం తెచ్చుకొన్న డబ్బు లెక్కపెట్టి 'ఈ అయిదు వందలూ ఏ మూలకొస్తాయి? మహానగరంలో మూడు రోజులు సరిపోవు. ఎప్పుడయినా కాస్త సరదాగా తిరుగుదామనుకొన్నా వీలుపడదు' అన్నాడు కొంచెం పెద్దగా. కాని తనలో తాను అనుకుంటున్నట్లుగా ఆయన విసుక్కొన్నాడు. ఆమె ఆయన్ను గమనించనట్లు నటిస్తూ గమనించింది.

ఆయన బెడ్డింగు పరచకొని పడుకున్నాడు

మరో పది నిమిషాల తర్వాత బండి చిన్న స్టేషనులో ఆగగానే అవతల దూరంగా కూర్చున్న మనిషి గబగబా రాఘవయ్య దగ్గరకు వచ్చి "అయ్యా నా పరుపు చుట్ట, చొక్కా, లాగూ అదుగో అక్కడే ఉన్నాయి. పెద్ద భయం ఏమి లేదు కాని ఒక్క రవ్వ కన్నేసి ఉంచండి. క్రిందికి వెళ్లి టీ త్రాగి వస్తాను" అన్నాడు.

"ఓ అలాగే" అన్నాడు రాఘవయ్య.

"మరి మీరూ త్రాగరూ?" ఎంతో చనువుగా అడిగాడతను. అందుకు నవ్వుతూ రాఘవయ్య "టీ త్రాగినా నాకు నిద్రవస్తుంది. అదికాక నా దగ్గర చిల్లరలేదు. ఉన్నవన్నీ వంద రూపాయల నోట్లు" అన్నాడు. ఆ మాటమీద అతను నొచ్చుకుంటున్నట్లు నటిస్తూ "అయ్యో

దానికేం భాగ్యమండీ— నేనే ఇస్తాను. మీరూ వస్తారా— పోనీ నేను తీసుకొని రానా?" అన్నాడు.

"అబ్బే, ఎందుకు వద్దులెండి, మీరు వెళ్ళి త్వరగా వచ్చేయండి. బండి ఇక్కడ ఎక్కువసేపు ఆగదు." అన్నాడు రాఘవయ్య. అతను తిరిగి వచ్చాక తన ప్రక్కమీద కూర్చోమని ఆయన పాయిఖానా గదిలోకి వెళ్లి తలుపు గడియ వేయకుండానే లోపల నిలబడి, పర్సు తీసి, డబ్బు అంతా బనీను లోపలి జేబులో పెట్టుకొని, టికెట్టు మరో జేబులో భద్రపరచి, చిన్న పాకెట్ నోటు పుస్తకం పర్సులో కుక్కి, పర్సు ఎత్తుగా, కన్పించినందుకు తృప్తిపడి, నెమ్మదిగా బయటకు వచ్చాడు.

అతనికి దగ్గరగా కూర్చుని రాఘవయ్య నవ్వుతూ "మీరు మంచి వారని నాకిప్పుడు నమ్మకం కలిగింది. ఇందాకటినుంచీ మాట్లాడకుండా, అదోలా ఉంటే నేను ఏదో అనుమానించాను. తోటి మనిషిని అనుమానించడం ఎంత పొరపాటో ఇప్పుడు నేను గ్రహించాను. వచ్చేది పెద్ద స్టేషను. ఎంత లేదన్నా గంటసేపు ఆగుతుంది, అక్కడ క్రాసింగు అదీ ఉంటుంది. నేను ఆ కాసేపూ పడుకొంటాను. నిద్ర ఆపుకోలేక పోతున్నాను. మీరు నాయందు దయఉంచి ఇటో కన్ను వేసి ఉంచండి. బండి ఆగినప్పుడు పరాయివాళ్లు ఎవరెవరో వస్తారు. మనం కాస్త జాగ్రత్తగా ఉండాలి" అన్నాడు. అందుకు అతను నవ్వుతూ "ఏం భయంలేదు, నేను మేల్కొనే ఉంటాను. మీరు నిశ్చింతగా పడుకోండి" అన్నాడు. అతను వెళ్లి తన సీటులో కూర్చోగానే రాఘవయ్య నెమ్మదిగా పర్సుతీసి దిండుకింద పెట్టుకొన్నాడు. కొన్ని క్షణాల తర్వాత కుడిచేతివేపు ఉన్న ఆ పర్సు తీసి ఎడమచేతివేపు పెట్టుకొన్నాడు. తన ప్రక్కసీటుపై పడుకొన్న ఆమె ఇది గమనించిందా,

లేదా అని ఒకటి రెండుసార్లు ఆమెవంక పరీక్షగా చూచాడు ఆమె ఒకసారి కళ్లు తెరిచి ఆయనవంక చూచి మళ్ళీ ఏమీ ఎరగనట్లు కళ్లు మూసుకొని పడుకొన్నది. పది నిమిషాల తర్వాత రాఘవయ్య గాఢనిద్ర నటించాడు. ఆమె నెమ్మదిగా చప్పుడు చేయకుండా లేచి కూర్చుని, అతనివైపు తిరిగి పర్సు దిండు క్రింద ఉన్నదని సంజ్ఞలుచేసి తెలియపరిచింది. 'ఇక భయంలేదు' అనుకొంటూ రాఘవయ్య కాళ్లు బాగా చాపుకొని మరోవైపు తిరిగి పడుకొని నిశ్చింతగా నిద్రపోయాడు. బండి ఆగినప్పుడు ఆయనకు మెలకువ వచ్చింది. కాని ఆయన కదలకుండా అలా పడుకొన్నాడు. ఆమె నెమ్మదిగా లేచి గుమ్మం దగ్గరకు వెళ్ళింది. అతను పరువుచుట్ట అందించాడు ఆమె అది అందిపుచ్చుకొని బండి దిగింది పిల్లిలా. అతను రాఘవయ్య దగ్గరకు వెళ్లి ప్రక్కగా నిలబడి, ముందుకువంగి, ఆయన ముఖంవంక చూచాడు. ఆయన మంచి నిద్రలో ఉన్నట్టు నమ్మకం కలిగిన మరుక్షణంలో అతను నేర్పుగా, నెమ్మదిగా దిండు క్రిందనుంచి పర్సు లాగేసి, మరుక్షణంలో ఒక్క అంగలో గుమ్మం దగ్గరకు వెళ్లి ఆ పర్సు ఆమెకు అందించాడు. ఆమె అది తీసుకొని గబగబా అవతలకు వెళ్లిపోయింది. అతను అయిదు నిముషాలదాకా గుమ్మంలో నిలబడి, నెమ్మదిగా దిగి వెళ్లాడు.

రాఘవయ్య ఒకసారి కళ్లుతెరిచి అటూ ఇటూ చూచి మళ్ళీ కళ్ళు మూసుకొని హాయిగా, బండి – మహానగరం చేరేవరకూ నిద్రపోయాడు.

అక్కడ రైలు ఆగగానే లైసెన్సు కూలీలు పెట్టెలోనికి జొరబడ్డారు. రాఘవయ్య గాభరాపడుతూ లేచికూర్చుని బెడ్డింగు చుట్టుకొని, తన సామాన్లు కూలీకి చూపించాడు. పెట్టె, బెడ్డింగు తీసుకొని సాధ్యమైనంత త్వరగా ముందుగా నిర్ణయించిన హోటలుకు వెళ్ళమనీ,

అంత పెద్దమొత్తం డబ్బు తన దగ్గర ఉన్నది కనుక టాక్సీలోనే వెళ్ళితీరాలనీ యజమాని చెప్పిన మాటలు రాఘవయ్యకు జ్ఞాపకం వచ్చాయి.

గేటుదాకా వెళ్లాక ఆయనకు ఒక క్రొత్త ఆలోచన వచ్చింది. 'అమ్మనాయనో' అనుకున్నాడాయన. 'మరేం ఫరవాలేదు. ఆ హోటలు నాకు క్రొత్త. ఆ గదిలోవాళ్లు కాస్త భయపెడితే బెదిరి పారిపోవడం కంటే ఇది మంచిది' అనుకొని ఆయన లైసెన్సు కూలీని వెనక్కు మళ్ళించి, సామాను క్లోక్ రూముకు చేర్పించాడు. అక్కడ ఆయనకు పూర్వ పరిచయంఉన్న వ్యక్తి కనిపించాడు. ఆ పెట్టె అక్కడ పెట్టించి రసీదు తీసుకొన్నాడాయన.

పరుషచుట్ట తీసుకొని ఆయన నిర్భయంగా నరానరి హోటలుకు వెళ్ళాడు. అక్కడ సరుకు అమ్మకానికి సిద్ధంగా ఉన్నదని చెప్పిన కంపెనీ బ్రోకరు ఎదురయ్యాడు. అతని వెంట మరోవ్యక్తికూడా ఉన్నాడు. అతనే ముందుగా రాఘవయ్యను పలకరించి పేరూ, ఊరూ అన్నీ తెలుసుకున్నాక నవ్వుతూ "మీరు ఫలానా అని నేను ముందే పోల్చుకున్నాను. అయినా రివాజు చొప్పున అడిగాను. ఏమీ అనుకోకండి. మీ యజమానిగారు కోరినట్టుగా ఇక్కడ అన్ని ఏర్పాట్లూ చేశాను. ఈ హోటలులో మీకోసం ఓ మంచి గది రిజర్వు చేశాను. పదండి కాసేపు విశ్రాంతి తీసుకొన్నాక మనం వ్యాపార విషయాలు మాట్లాడుకొందాం. అది సరే మీరా బెడ్డింగు స్వయంగా మోసుకొస్తున్నారెందుకూ— పనివాడికి ఇవ్వకపోయారా? అసలెందుకూ టాక్సీ డ్రైవరే తెచ్చేవాడే!" అన్నాడు.

రాఘవయ్య నవ్వుతూ "ఫరవాలేదు పదండి. అసలు వ్యవహారం ఫైసలు అయ్యేదాకా ఇది నా దగ్గరే ఉండాలి. బరువైనా తప్పదు - ఇతరులు చూచి నవ్వినా తప్పదు" అన్నాడు.

ఆ గదిలోకి వెళ్లి కూర్చున్న తర్వాతకూడా రాఘవయ్య ఆ పరుపుచుట్ట విడిచి పెట్టలేదు. అయిదు నిమిషాల తర్వాత అక్కడ పనిచేసే కుర్రవాడు వస్తే మూడు కప్పులు కాఫీ తెమ్మన్నాడాయన. అతను అటువెళ్ళాక ఆయన బెడ్డింగు, చంకన పెట్టుకొని, గబగబా స్నానాల గదిలోకి వెళ్లి, తలుపు వేసుకొని, ముఖం, కాళ్ళూ, చేతులూ కడుక్కొని, పై కండువాతో ముఖం తుడుచుకొని, అక్కడ వాష్ బేసినుకు పై ఎత్తుగోడకు ఏటవాలుగా తగిలించిన అద్దంతో ముఖం చూచుకొంటూ గబగబా తల దువ్వుకొన్నాడు అంతలో ఆయన బనీను జేబులో నుంచి డబ్బు తీసి అద్దంవెనుక భద్రపరచి, చప్పున వెనుతిరిగి బెడ్డింగు చంకన పెట్టుకొని, ఆ గదిలోకి వచ్చి, అది అక్కడ బల్లమీద పెట్టి, దాని ప్రక్కగా కుర్చీ లాక్కొని కూర్చుని, 'హమ్మయ్య' అన్నాడాయన పెద్దగా. హోటలు కుర్రవాడు తెచ్చిన కాఫీ కప్పు అందుకొని గబగబా త్రాగేసి ఎదురుగా దూరంగా, సోఫాలో దర్జాగా కూర్చుని, తనవంక చూచి నవ్వుతున్న బ్రోకరును అతనివెంట ఉన్న వ్యక్తినీ దగ్గరకు రమ్మని పిలిచాడు రాఘవయ్య.

వాళ్లు ఇద్దరూ వచ్చి, ఎదురుగా కుర్చీలలో కూర్చోగానే ఆయన "ఆ, ఇప్పుడు చెప్పండి. బిస్కట్లా - కడ్డీలా?" అని అడిగాడు.

"మీకు ఎలా కావాలీ?"

"బిస్కట్లు అయితే మంచిది."

"ఓ అలాగే యిస్తాను."

"మరి శాంపిలు చూపిస్తారా?"

"అందుకు అభ్యంతరమా చూడండి". అని అతని జేబులోనుంచి మేలిమి బంగారంబిళ్ళ తీసి ఆయన చేతికి యిచ్చాడు. ఆయన అది తీసుకొని చిన్న గరుకురాయి మీద గీచి పరీక్షిస్తుండగా అతను పెద్దగా

నవ్వుతూ, "అయ్యా అంత అనుమానం అక్కర్లేదు. ఇలా ఒకటి అరా పరీక్షించి చూడడం కాదు మొత్తం సరుకు అంతా ఇక్కడికే తెప్పిస్తున్నాను. ఒక పార్టీకి కబురు పెట్టాను. వాళ్ళు ఈ పాటికి వచ్చే ఉంటారు. సరే ముందు మీరోమాట చెప్పండి! సరుకు నచ్చిందా? తీసుకొంటారా?" అని అడిగాడు.

రాఘవయ్య గుమ్మంవంక చూస్తూ "తీసుకొంటాను'' అన్నాడు.

"డబ్బు పూర్తిగా ఇవ్వాలి" అన్నాడు అతను కొంచెం పెద్దగా.

"ఇస్తాను."

"బ్యాంకుకు వెళ్లాలా - అలా అయితే మేం అక్కడకు వచ్చి తీసుకోం.''

"అదేం" అన్నాడు రాఘవయ్య ఆశ్చర్యం ప్రకటిస్తూ అందుకు అతను ముందుకు వంగి నెమ్మదిగా "అయితే మీకు ఈ వ్యాపారం క్రొత్త అన్నమాట. మాతో మాట్లాడి వెళ్లి బ్యాంకులో మీరు డబ్బు తీసుకోగానే ఎవరో ఒకడు మీ వెంట పడతాడు. అతని సహాయంతో మమ్మల్ని తేలికగా పట్టుకొంటారు'' అన్నాడు.

"ఆ. అదేం జరగదు లెండి, మీకు ఏ విధమైన ఇబ్బంది రాకుండా నేను జాగ్రత్త పడతాను."

"అబ్బే అదేం కుదరదు. ఈ విషయం మీ యజమానికి ముందే ఫోన్లో చెప్పాము. మీకు రొఖ్ఖం ఇచ్చి పంపుతున్నానని చెప్పారాయన."

"అలాగా, అయితే మరి ఆలస్యం దేనికి" అన్నాడు రాఘవయ్య.

ఆ బ్రోకరు నెమ్మదిగా బయటకు వెళ్లి మరో పది నిమిషాల తర్వాత మరో ఇద్దరు వ్యక్తులను వెంట పెట్టుకొని తిరిగి వచ్చాడు.

వాళ్లు ఒక చిన్న ట్రంకు పెట్టెతెచ్చి బల్లమీద పెట్టి దూరంగా నిలబడ్డారు. బ్రోకరు పెట్టె తెరచి చూపించాడు.

పది నిముషాలలో బేరం ఫైనలు అయింది. కాని బిల్లు విషయంలో పేచీ వచ్చింది. ఏదో ఒక విధంగా బిల్లు ఇస్తేనే కాని వల్ల కాదన్నాడు రాఘవయ్య. చివరకు బ్రోకరు లేచి నిలబడి. లాగు జేబులోనుంచి బిల్లు పుస్తకం తీసి నెమ్మదిగా "మరి వెంటనే డబ్బు తియ్యండి. జేబులో ఉంచుకోవడం క్షేమంగా ఉండదని బెడ్డింగులో పెట్టారు కదూ. త్వరగా తీసి లెక్క పెట్టి ఇచ్చేస్తే మేం వెళతాం" అన్నాడు.

రాఘవయ్య ఇరకాటంలో పడ్డట్టు నటించాడు. బెడ్డింగుమీద రెండు చేతులూ పెట్టి నొక్కుతూ "అయితే మీకు అంతా ముందే తెలుసునన్నమాట. ముందు బిల్లు వ్రాసి సరుకు నాకివ్వండి. ఈ గది బయట డబ్బు యిస్తావదండి" అన్నాడు. అంతే మరుక్షణంలో ఆ పెట్టె తెచ్చిన వాళ్ళలో ఒకడు ఒక్క దూకున ముందుకువచ్చి, ఆయన ముందు నిటారుగా నిలబడి, బొడ్డులోనుంచి చిన్న పేష్కప్ బయటకు లాగి ఆయన్ను భయపెడుతూ "కదలినా, అరిచినా ఒక్క వేటుతో కైలాసానికి పంపిస్తాను. అయిదు నిముషాలు కళ్లు మూసుకొని కూర్చోండి. నేను రెడీ అంటాను. అప్పుడు తెరవండి. తెలిసిందా?" అన్నాడు.

రాఘవయ్య కళ్లు రెండూ నిజంగానే గట్టిగా మూసుకొన్నాడు. అయిదు నిముషాలు గడచిపోయినా కూడా ఏ మాటా విన్పించక పోయే సరికి ఆయన కళ్లు తెరచి నలువైపులా కలయచూచాడు. బల్లమీద బెడ్డింగూ లేదు, ట్రంకు పెట్టా లేదు. ఆ గదిలో మరెవ్వరూ లేరు. రాఘవయ్య నవ్వుకొంటూ నెమ్మదిగా లేచి గుమ్మం దగ్గరకు వెళ్లి తలుపు తీసి బయటకు తొంగిచూచాడు. అక్కడా ఎవరూ కన్పించలేదు.

ఆయన స్నానాల గదిలోకి వెళ్ళి, అద్దం వెనక భద్రపరచిన అయిదు వందలూ తీసుకొని, జేబులో పెట్టుకొని, అడుగులో అడుగు వేసుకొంటూ కౌంటరు దగ్గరకు వెళ్లి అక్కడఉన్న గుమాస్తాతో "అయ్యా నేను గది ఖాళీచేసి వెడుతున్నా - తనిఖీ చేసుకొంటారా'' అన్నాడు.

ఆ గుమాస్తా చిరునవ్వు నవ్వుతూ ''అవును తెలుసు నాకు, మీ బ్రోకరు చెప్పాడు. గది అద్దె అదీ చెల్లించాడు. మీ సామాను ముందే వాళ్లు పట్టుకొని వెళ్ళారుగా - మీరూ వెళ్లుతున్నారన్నమాట. అలాగే మేం తర్వాత తనిఖీ చేసుకొంటాం. మీలాంటి పెద్దవాళ్ళు వచ్చి వెళితే మేం తనిఖీ చెయ్యవలసిన పనేలేదు. మీకేమైనా సహాయం కావాలంటే చెప్పండి. చేస్తాను" అన్నాడు.

రాఘవయ్య తల వంచుకొని నెమ్మదిగా హోటలు బయటకు వచ్చి టాక్సీ పిలిచాడు. ఆ టాక్సీ ఆ వీధి మలుపు తిరుగుతుండగా తన వెనుక మరో వ్యక్తి కారులో వస్తున్నట్టు రాఘవయ్య గుర్తించాడు. ఆయన టాక్సీ డ్రైవరుతో స్టేషన్‌కి పోనీ త్వరగా'' అన్నాడు.

ఆయన టాక్సీ దిగి లోపలకు వెళ్ళాక వెంట వచ్చిన కారు మళ్ళీ వెనక్కు వెళ్ళి పోయింది. ఆయన 'హమ్మయ్య' అనుకొంటూ గబగబా రైలు స్టేషనులో ఉన్న కాంటీన్‌కు వెళ్లి అవీ ఇవీ తిని, వేడి వేడి కాఫీ త్రాగి ఉత్సాహం తెచ్చుకొన్నాడు

ఆయన అక్కడినుంచే తనకు బాగా తెలిసిన ఇద్దరు ముగ్గురు బంగారం వ్యాపారస్థులకు ఫోన్ చేశాడు నిముషాల మీద ఒక వ్యాపారస్థుడితో బేరం కుదుర్చుకొని, పైకం మొత్తం తీసుకొని వెళ్ళడానికి తగిన బందోబస్తుతో స్టేషన్‌కు రావలసిందని చెప్పాడాయన. వాళ్లు వచ్చాక ఆయన క్లోక్ రూముకు వెళ్లి తన పెట్టె విడిపించుకొని, అది తీసుకొని ఊళ్ళో దుకాణానికి వెళ్ళాడు.

ఆ కొట్టు యజమాని రాఘవయ్యను చూచి పెద్దగా నవ్వడం మొదలు పెట్టాడు. "ఎందుకండీ రాఘవయ్యగారూ ఇంత శ్రమపడ్డారూ. ఈ పెట్టి ఏమిటి - దీన్నిండా ఈ ఖాతా పుస్తకాలేమిటి - వాటి మధ్య డబ్బు - నోట్ల కట్టలు పెట్టుకొని రావడం ఏమిటీ— అది స్టేషను నుంచి ఇక్కడకు తీసుకొని రావడానికి ఇంత బందోబస్తు దేనికి- నాకేం బోధపడడంలేదు. పైగా కొన్న సరుకు వెంట పెట్టుకొని పోవడానికి జంకుతున్నారు. సరే మీ యిష్టంవచ్చినట్లే చెయ్యండి. ఈ సారికి మీరు కోరినట్లుగా - మీరు జమకట్టిన అరవై వేల రూపాయల విలువ మేరకు బంగారం మీరు కోరిన తేదీనాటికి మీ యింట్లో మీకు న్వయంగా వప్పగించే ఏర్పాటు చేస్తున్నాను. అయితే ఇక ముందునుంచి మీరింత శ్రమ పడనక్కరలేదు మీరు అక్కడినుంచి ఫోన్లో మాట్లాడి ఆర్డర్ బుక్‌చేస్తే చాలు. మిగతా వనంతా మేమే చేసేస్తాం. చట్టా వ్యాపారం అంతా అలాగే జరుగుతుంది" అన్నాడు.

రాఘవయ్యకూడా నవ్వుతూ "అలాగేనండి. ఈసారి కొంచెం అనుభవం సంపాదించాను కనుక ఇకనుంచి అలాగే చేస్తాను. మిమ్మల్ని కూడా శ్రమ పెట్టాను'' అన్నాడు.

ఆయన వాళ్ళతో వ్యాపారాది విషయాలు మాట్లాడుతూ, మాట్లాడుతూనే మధ్యలో లేచి బయటకు వెళ్ళి తన యజమాని ముందుగా మాట్లాడి ఉంచిన కంపెనీకి ఫోన్‌చేశాడు. ఆ కంపెనీవాళ్ళు చెప్పిన దాన్ని బట్టి హోటలుకు వచ్చి కలుసుకొన్న బ్రోకరు వాళ్ళవాడు కాదనీ, అక్కడకు వచ్చి పోయే బ్రోకర్లలో ఒకడు కావచ్చుననీ తెలిసింది. ఆయన ఫోన్ పెట్టేస్తూ "సర్లెండి— మీరే వంపారనుకొని అతని దగ్గరే బంగారం కొన్నాను. మంచి బంగారం దొరికింది. ఈసారి వచ్చినప్పుడు ఇంత సాహసం చెయ్యను. సరాసరి మీ దగ్గరకే వస్తాను. దయచేసి మా

యజమానికి ఈ విషయం ఫోన్‌చేసి చెప్పండి. అందుకు అయ్యే ఖర్చు ఆయనే భరిస్తాడు. మరి సెలవు" అన్నాడు.

రాఘవయ్య తిరిగి ఆ దుకాణానికి వెళ్ళి "మరి నాకు సెలవు ఇవ్వండి. బిల్లు వ్రాసి పోస్టులో పంపండి" అని అంటే ఆ కొట్టు యజమాని ఆయన ముందే రాఘవయ్య పేరనే బిల్లువ్రాసి కవరులో పెట్టి అడ్రసు వ్రాయమన్నాడు. ఆయన తన ఇంటి చిరునామా వ్రాశాడు.

"అవును ఇలాగే చెయ్యమన్నాడుగా ఆయన ఇలా అయితే ఈ వ్యాపారమంతా కొట్టు ఖాతాలోకి రాకుండా ఉంటుందనీ ఆయన ఆలోచన. ఏదశలో పట్టుబడినా మొదటికే మోసం వస్తుందని ఎంత చెప్పినా వినడు. అదేమంటే నీకు జీతంకాక ఒక శాతం లాభం ఇస్తున్నాగదా ఇటువంటివి భరించవద్దా మరి అంటాడు. కాదని ఏం చెయ్యగలను' అలా అనుకొంటూ రాఘవయ్య పెట్టె టాక్సీలో పెట్టించుకుని స్టేషన్‌కు వెళ్ళి తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాడు.

ఆ ప్రయాణం హాయిగా సాగింది. రాఘవయ్య ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటులో ఒక బెర్తు అంతా రిజర్వు చేసుకొని సుఖంగా ప్రయాణం చేశాడు.

ఆ బండి జంక్షనులో ఆగిన అయిదు నిముషాలకు ఆ పెట్టెలోనికి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారిలో ఒకడు నెమ్మదిగా రాఘవయ్య ముందుకు వచ్చి, ఆయన పంకా క్రిందఉన్న పెద్ద పెట్టెవంకా కొన్ని నిముషాలపాటు పరీక్షగా చూచి, ఆయన ఎవరో నిర్ధారణ చేసుకొని, జేబులోనుంచి చిన్న చీటీ తీసి చూపించాడు. అది చూచి ఆయన ఆశ్చర్యపడుతూ "అయితే మీరు ఆయన దగ్గరనుంచే వస్తున్నారా.

నరే. బాగానే ఉన్నది. ఇంకేమన్నా చెప్పారా?" అన్నాడు. అతను నవ్వుతూ "ముందు మీకు అభినందలు చెప్పుకొంటున్నాను. అయితే ఆయన కొనమన్నదంతా కొన్నారన్నమాట. మీరు ధైర్యశాలురే" అని ఇంకా ఏమో అనబోతూ ఉంటే అతని వెంటవచ్చిన రెండోవ్యక్తి గబగబా ముందుకు వచ్చి "అందుకు దాఖలా ఏమిటి?" అన్నాడు దబాయిస్తున్నట్లు.

రాఘవయ్య ఏమీ తడుముకోకుండా "పెట్టెలోఉన్న సరుకే దాఖలా" అన్నాడు. అందుకు అతనికి తృప్తి కలిగింది. అందుకు నవ్వుతూ "అంతా బాగుంది. మీరోసారి నాతో రండి. ఈ పెట్టె అక్కడికి ఎలా చేర్చాలో మన యజమాని చెప్పి పంపాడు ఆ ఏర్పాటు మీకు స్వయంగా చూపిస్తాను అన్నాడు. రెండో వ్యక్తి రాఘవయ్యను ముందుకు నెడుతూ "పదండి" అన్నాడు కొంచెం పెద్దగా.

రాఘవయ్య క్రిందకు దిగి అతనివెంట ప్లాట్‌ఫారంమీద కొంత దూరం నడిచాడు. అలా కొంత దూరం వెళ్ళాక అతను రాఘవయ్య వంకకు తిరిగి "మీరు అనవసరంగా భయపడి ఏ రకమైన ఆర్భాటం చెయ్యకండి ఈ మాత్రానికి గొంతులు కోసుకోవడం అనవసరం. స్టేషను బయట కారు సిద్ధంగా ఉన్నది. త్వరగా వచ్చి చూచిరండి. మీరు ఆ పెట్టె తీసుకొని ఆ కారులో మాతోపాటు వచ్చేయండి. ఈ ప్లాను ప్రకారం జరిగితే మీకు ఏ ప్రమాదం ఉండదు. ఇందువల్ల మీతోపాటు మాకూ కొంత కమీషన్ దొరుకుతుంది" అన్నాడు.

రాఘవయ్య మారుమాటాడకుండా అతని వెంట స్టేషను బయటకు వెళ్ళి, తిరిగి తన పెట్టె దగ్గరకు వచ్చాడు. ఆయన్ని చూడంగానే లోపలఉన్న మొదటి వ్యక్తి గుమ్మంలో నిలబడి "మరి ఆలస్యం దేనికి. త్వరగా కూలీలను పిలవండి" అన్నాడు.

రాఘవయ్య భయపడినట్లు నటిస్తూ "అలాగే, తప్పేదేముంది. నాకు ముందు నుయ్యి, వెనుక గొయ్యి. నాకు యజమాని ముందుగా ఈ ఏర్పాటును గురించి ఒక్కమాటైనా చెప్పలేదు. మీ మాట కాదంటే మీరు బ్రతకనిచ్చేలా లేరు" అని కొన్ని క్షణాలు కళ్లు మూసుకుని, ఏదో ఆలోచిస్తున్నట్లు కన్పించి, అంతలో ఒక నిర్ణయానికి వచ్చినట్లు "మరి పదండి - బంగారం ఉన్న పెట్టె కనుక కూలీలకు వప్పగించడం మంచిదికాదు. వాళ్లు పెట్టెలు మార్చేసినా మార్చేయగలరు. మనం పట్టుకొని పోదాం ఈ పది అడుగులు మోయలేక పోతామా" అన్నాడు.

రాఘవయ్య ఆ పెట్టె వాళ్ళచేతనే మోయించాడు. మధ్యలో ఒకచోట దింపుకొంటే ఆయన "అయ్యో బరువుపని చేయిస్తున్నానే - పోనీ బంగారం విడిగా తీసి ఇవ్వనా? సరుకు అంతా నాకండువాలో చుట్టి పట్టుకొని పోదాం" అన్నాడు. వాళ్ళు ఇద్దరూ కొంచెం పెద్దగా "నువ్వు ఊరుకోవయ్యా ఒట్టి వెర్రిబాగులవాడిలా మాట్లాడతావేం? ఎవరైనా చూస్తే గొడవ కాదూ" అంటూ పెట్టె మళ్ళీ ఎత్తుకొని ఒక్క ఊపులో స్టేషను బయటకు వెళ్ళి అది కారులో పెట్టి, తానూ ఎక్కి కూర్చున్నాడు. రాఘవయ్య గాభరాపడుతూ వాళ్ల ముందుకు వచ్చి, "అయ్యా ఒక్క నిముషం ఆగండి. నా కళ్ళజోడు నా సీటుమీద పెట్టి మర్చిపోయి వచ్చాను. ఎవరూ చూడకుండా ఉండేందుకు దానిపైన నా కండువా వడేసి వచ్చాను. అవి తీసుకొని క్షణంలో తిరిగి వస్తానుండండి".

రాఘవయ్య అటు తిరగగానే కారు కదిలింది. అంతలోనే ఆ కారు శరవేగంతో దూసుకొనిపోయింది. ఆయన గబగబా వెళ్ళి బండిలో కూర్చున్న కొద్ది నిమిషాలకి రైలు కదిలింది.

ఆయన తృప్తిగా నవ్వుకొన్నాడు. అంతలో ఆయనకు తన

యజమాని అంత మోసం, అన్యాయం చెయ్యడానికి పూనుకొన్నందుకు పట్టరాని కోపం వచ్చింది 'మొదటినుంచీ ఏదో కుట్ర ఉన్నట్లే ఉన్నది' అనుకొంటూ క్రిందటిరోజునుంచి అప్పటిదాకా జరిగిన సంగతులన్నీ జ్ఞాపకం చేసుకున్నాడాయన. 'అవును ఆయనకేదో దురుద్దేశం ఉండి తీరాలి. లేకపోతే అంత పెద్ద మొత్తం రొఖ్ఖం ఇవ్వడు. తీరా వెళ్లాక దొంగ బంగారం కొనడానికి ఫోన్‌మీద ఏర్పాట్లు చెయ్యడు. అవన్నీ అయ్యాక సరుకు భద్రంగా తీసుకొని వస్తున్నానని తెలియపరచిన తర్వాత ఈ గూండాలను నా మీదకు పంపాడు. వెధవ కమిషన్ ఎగగొట్టడానికి అంత పన్నాగం పన్నాడు. ఆయనకు సరిగ్గా బుద్ధి చెప్పాలి' అనుకొన్నాడాయన.

కొంతసేపు తర్వాత ఆయన నగరంలో కొన్న బంగారం అంతా సొంతం చేసుకోవడం ఎలాగా అని ఆలోచించడం మొదలుపెట్టాడు. అవును అదేమంత కష్టంకాదు. ముందీగండం గడచి బయట పడ్డాక తప్పంతా ఆయన మీదనే నెట్టి నేను తప్పుకున్నాక - ఆ బంగారం మార్చుకొని సొమ్ము చేసుకొని మరేదైనా మంచి వ్యాపారం చెయ్యోచ్చు- ఓ లక్షణంగా చెయ్యోచ్చు - ఒక్క ఏడాదిలో నేను లక్షాధికారి కావచ్చు' అలా అనుకొంటూ ఆయన కళ్ళు మూసుకొన్నాడు. మానసికంగానూ, శారీరకంగానూ బాగా అలసిపోయి ఉండడంవల్ల ఆయనకు కళ్ళు గట్టిగా మూసుకొన్న కొద్ది నిముషాలకే మంచి కునుకు పట్టింది.

రాఘవయ్య తియ్యని కలలు కంటూ చాలా సేపు హాయిగా నిద్రపోయాడు.

---